

.. అధికారం రెడ్డీలదా?

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పోటీచేసి సత్తా చాటాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-30 (సోమవారం సాయంత్రం)

సహర్ 5-05 (మంగళవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.7 /16.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి వేళ చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలి



నారాయణపేట రూరల్: స్వామి వివేకానందుడిని యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు కదలాలని ఎస్పీ యోగేష్ గౌతం అన్నారు. మండలంలోని కోటకొండలో స్వామి వివేకానందుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఐదేళ్లు కావస్తున్న సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. యువత చెడు మార్గాల్లో పయనించకుండా సన్మార్గంలో వెళ్లాలన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. క్రమశిక్షణ కలిగి లక్ష్యం, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధ్యమేనని తెలిపారు. కార్యక్రమంలో బాలస్వామి, శివరాములు, రవి, సిద్దు, కృష్ణయ్య, సురేందర్, జగదీష్, నరేష్, కిషోర్ పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టాలి



నారాయణపేట టౌన్: మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులను అరికట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు బాలమణి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభలో వారు మాట్లాడారు. మహిళలపై హింస, వేధింపులను ప్రతిఘటించాలని, వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులు, మెప్మా, ఐకేపీ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల పరిధిలో పని చేస్తున్న మహిళలను ప్రభుత్వాలే శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సాధికారత, సమానత్వం గురించి గొప్పలు చెప్పుకునే ప్రభుత్వాలు ముందు సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాధిక, మమత, పార్వతి, నాంచారమ్మ, చంద్రకళ, భాగ్యమ్మ,అశ్విని,సుశీలమ్మ,పలువురు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట రూరల్: జిల్లా విద్యా శాఖలో నెలకొన్న సమస్యలపై నూతనంగా ఎన్నికైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డికి స్థానిక పీఆర్టీయూ నాయకులు వినతిపత్రం అందించారు. ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు శాలువాతో సన్మానించి బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన నారాయణపేట జిల్లాకు టీజీఎల్ఐ కార్యాలయ ఏర్పాటుకు కృషి చేయాలని, సరిహద్దు ప్రాంత పాఠశాలలో పనిచేస్తున్న కర్ణాటక ఉపాధ్యాయులకు మెడికల్ రియంబర్స్‌మెంట్ కల్పించాలని, డీఈఓ, ఎమ్మార్సీ కార్యాలయాల్లో సిబ్బందిని పెంచాలన్నారు. యాదగిరి జనార్దన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

సమస్యల మాటేమిటి?



నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డు

'పేట' మార్కెట్‌యార్డులో రైతుల అగచాట్లు

- వినియోగంలోకి రాని విశ్రాంతి భవనం
- ఈ-నామ్ పక్కా అమలుతో జీరో దందాకు కళ్లెం పడేనా
- 15 ఏళ్లుగా పశువుల సంతకు ఎదురుచూపులు
- నేడు 'పేట' వ్యవసాయ మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డును రూ.లక్షలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నా.. జీరో దందా, అధిక కమీషన్లతో రైతు జేబుకు చిల్లు పడుతుంది. దీనికితోడు ఎక్కడెక్కడి నుంచి ధాన్యంతో వచ్చే వారు సేద తీరేందుకు నిలువ నీడ లేకపోవడంతో రైతులు వేసవిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో పేట మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్.శివారెడ్డి అధ్యక్షతన సోమవారం ఉదయం 11.30 గంటలకు మార్కెట్ కార్యాలయ ఆవరణలో సాధారణ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో 2025–26 సంవత్సరానికి ఆదాయాన్ని పెంచడమే ప్రధాన ఎజెండా. గత మూడు నెలల్లో వచ్చిన ఆదాయ, వ్యయాలపై, 2025–26 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ అంచనాలు ఆమోదించడం, తదితర అంశాలపై చర్చిస్తారు. కానీ, కేవలం ఆదాయంపైనే కాకుండా యార్డులో నెలకొన్న సమస్యలపై కమిటీ దృష్టి సారించి పరిష్కరించాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.



నిరుపయోగంగా వేయింగ్ మిషన్

యార్డు సామర్థ్యం పెంపుతో మేలు

11 ఎకరాల విస్తీర్ణంలో పేట మార్కెట్ యార్డు ఉంది. సీజన్‌లో తీసుకువచ్చే ధాన్యంతో యార్డు ఎప్పుడూ కిటకిటలాడుతుంది. అయితే ఈ యార్డు సామర్థ్యం 9 వేల బస్తాలే. సీజన్‌లో వరి ధాన్యం, వేరుశనగ, కందులు, పెసర ఇతర పంటలు దాదాపు 20 వేల బస్తాల వరకు వస్తుంటాయి. స్థలం సరిపోక ఇటు వ్యాపారస్తులు, ఆటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించకపోతే వర్షం భయం వెంటాడుతూ ఉంటుంది. లేదా మరుసటి రోజు కొనుగోళ్లు నిలిపివేయాల్సిన పరిస్థితి ఉందని, మార్కెట్ యార్డు సామర్థ్యాన్ని పెంచేతే మేలు జరుగుతుంది.

పశువుల సంతకు ఎదురుచూపులు

నారాయణపేటలో పాతబస్టాండ్ సమీపంలో మార్కెట్‌యార్డు స్థలంలో పశువుల సంత జరిగేది. ఈ సంతకు నారాయణపేట, దామరగిద్ద, ఊట్కూర్, ధన్వాడ, కర్ణాటకలోని గుర్మిట్కల్, సైదాపూర్, యాద్గీర్ ప్రాంతాల నుంచి పశువుల క్రయ, విక్రయాలకు రైతులు వచ్చేవారు. కొత్త గంజ్ ఏర్పాటైన తర్వాత పశువుల సంత మురుగునపడింది. అయితే పశువుల సంతలో మార్కెట్ ఫీజు 2 శాతం ఉంది. ఇందులో ఒక శాతం మధ్యవర్తులకు, 1 శాతం మార్కెట్‌కు చెల్లిస్తుండడంతోనే పశువుల సంత బంద్‌కు కారణమని తెలుస్తోంది. ఈ ప్రాంత రైతులు పశువుల కొనుగోలుకు దేవరకద్ర, పెబ్బేర్ సంతలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్ పాలక వర్గం దీనిపై సమాలోచనలు చేసి 15 ఏళ్లుగా బంద్‌చేసిన పశువుల సంతను పునఃప్రారంభించేలా చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నా.. నిరుపయోగం

మార్కెట్‌యార్డులో రైతు విశ్రాంతి కోసం భవనాన్ని నిర్మించారు. ఆ భవనాన్ని తాళం వేయడంతో వినియోగంలోకి రావడంలేదు. యార్డుకు వచ్చే రైతులు ఎండ, వానల్లో సైతం సంచులపై సేదా తీర్చుకునే పరిస్థితి దాపురిస్తోంది. ఆ భవనంలో కావాల్సిన సౌకర్యాలను కల్పిస్తూ విశ్రాంతి తీసుకునే విధంగా పాలకవర్గం ఆలోచించాలని రైతులు కోరుతున్నారు. అలాగే, 2022 డిసెంబర్ 19న రూ.లక్షలు వెచ్చించి వేయింగ్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. పట్టుమని పది రోజులైనా చేశారో లేదో ఆ తర్వాత దాన్ని మూసేశారు. నిరూపయోగంగా మారిన ఆ వేయింగ్ మిషన్‌పై కమిటీ చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇదిలాఉండగా, నారాయణపేట, ధన్వాడ, ఊట్కూర్, దామరగిద్ద, మరికల్‌తో పాటు సరిహద్దులోని కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున యాసంగి, వానాకాలంలో సీజన్‌లో ధాన్యం తీసుకువచ్చి రైతులు విక్రయిస్తుంటారు. తెచ్చిన ధాన్యం అకాల వర్షాలకు తడుస్తుంది. ఇటీవల కవర్‌షెడ్ నిర్మాణం కోసం రూ.3 కోట్లు నిధులు సైతం మంజూరయ్యాయి. యార్డులో ఉన్న ఓపెన్ ప్లాట్‌ఫాంలపై కవర్ షెడ్లను నిర్మించాలని ఇటు రైతులు, అటు వ్యాపారస్తులు కోరుతున్నారు.



వినియోగంలోకి రాని రైతు విశ్రాంతి భవనం

జీరో దందాకు చెక్

మార్కెట్ యార్డుకు వచ్చే అన్ని రకాల ధాన్యాలను ఆన్‌లైన్‌లో ఈ – నామ్ ద్వారానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మార్కెట్‌యార్డుకు వచ్చే ధాన్యం లెక్కల్లో తప్పుడు రాతలు, సిండికేట్ ధరలు, అక్రమాలు జరగకుండా ఉంటాయి. కానీ స్థానిక మార్కెట్ యార్డులో మాత్రం ఆన్‌లైన్‌లో లాట్ నంబర్‌లు ఇస్తున్నారు.. ఆ తర్వాత పక్కాగా విక్రయాలకు సంబంధించిన తక్‌పట్టీలు ఆన్‌లైన్ ద్వారా ఇవ్వకపోవడం, అడిగిన వారికిఇస్తున్నా అందులో కమీషన్‌లో మార్పులు కనిపిస్తున్నాయి. మరో వైపు బుక్కచిట్టీలతోనే సరిపెడుతున్నారు. వ్యాపారస్తులు, కమీషన్ ఏజెంట్లు లాజిక్‌గా లాట్‌లను క్యాన్సల్ చేస్తున్నామని, రైతులు ఈ రోజు విక్రయించడం లేదంటూ అధికారులకు చెబుతున్నట్లు తెలుస్తోంది. మార్కెట్‌యార్డు అధికారుల కనుసన్నల్లోనే సంచికి ఇంత.. క్వింటాకు ఇంత అంటూ లోలోపల 'జీరో' దందాకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ– నామ్‌పై నిర్వహణపై కమిటీ ఏం ఆలోచిస్తుందో వేచి చూడాలి. ఇక ధాన్యం విక్రయించే రైతుల నుంచి రూ.వందకు రూ.4 కమీషన్ వసూలు చేస్తుండడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు. నిబంధనల మేరకు రూ.వందకు రూ.1.75 తీసుకోవాలి. కానీ కమీషన్ ఏజెంట్లు రూ.2, వ్యాపారులు మరో రూ.2 కమీషన్ తీసుకోవడం గమనార్హం. ఇవిగాక దడవాయి, హమాలీల చార్జీలతో పెద్దచిల్లే పడుతుందని చెప్పవచ్చు. ఈ విషయంపై కమిటీ ఓ నిర్ణయానికి వస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

దామరగిద్ద: ప్రతి ఊరి ఆడపడుచుకు బొడ్రాయి ఆరాధ్యదైవమని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గడిమున్కన్‌పల్లిలో గత మూడు రోజులుగా నాభిశిల ప్రతిష్ఠాపన, ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పుట్టింటి ఆడబిడ్డలు భక్తిశ్రద్ధలతో ఉత్సవాల్లో పాల్గొని పుట్టిన ఊరును, తల్లిదండ్రులను గౌరవిస్తారని మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. అంతకుముందు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనతోపాటు నాభిశిల అభిషేకం, హోమం, జలదివాసం, ధాన్యదివాసం, ప్రాణ ప్రతిష్ఠపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుభాష్, మాజీ ఎంపీటీసీ లక్ష్మి రాంచందర్, మాజీ ఎంపీపీ నర్సప్ప, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, సాయిరెడ్డి, పరుషరాంరెడ్డి, శ్రీనివాస్, మొగులప్ప, మహిళలు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



మహబూబ్‌నగర్‌లో తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు (ఫైల్)

తగ్గిన దూకుడు

ఉమ్మడి జిల్లాలో పన్ను వసూళ్లలో ఆర్టీఏ వెనుకంజ

- ఈ ఏడాది జిల్లాలో నామమాత్రంగా తనిఖీలు
- ఫీజు, జీవితకాల పన్ను రాకపోవడంతో అంతంతగానే రాబడి
- ఆ శాఖలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- గడిచిన మూడేళ్లతో పోల్చితే తారుమారైన పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో పన్నుల వసూలు ఇలా..

జిల్లా	లక్ష్యం	వసూలు చేసిన పన్ను (రూ.కోట్లలో..)	శాతం
మహబూబ్‌నగర్	90.08	82.00	89.05
నాగర్‌కర్నూల్	58.14	48.04	82.63
వనపర్తి	39.76	32.63	82.07
గద్వాల	43.09	35.87	83.24
నారాయణపేట	32.65	28.16	86.25

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లా రవాణా శాఖలో పూర్తిస్థాయిలో ఎంవీఐ, ఏఎంవీఐలు, ఇతర సిబ్బంది లేకపోవడంతో ఆశించిన స్థాయిలో పన్ను వసూలు కావడం లేదు. ప్రతి జిల్లాలో ఒకే ఒక్క ఎంవీఐ ఉండటంతో కార్యాలయంలో విధులు నిర్వహించడానికే సమయం సరిపోకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై సరైన దృష్టిపెట్టడం లేదు. దీంతో బయట తనిఖీలు, ఇతర రూపాల్లో వచ్చే పన్నుల్లో జాప్యం ఏర్పడుతోంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 118 మంది ఏఎంవీఐలకు పోస్టింగ్ ఇవ్వగా.. ఇందులో వనపర్తికి ఒకరు, నారాయణపేటకు ఒకరిని కేటాయించగా వారు సైతం ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు. గత మూడేళ్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం కంటే ఎక్కువ మొత్తంలో పన్ను వసూలు చేసి రాష్ట్రస్థాయిలో ఉమ్మడి జిల్లాకు మొదటి స్థానం వచ్చేది. కానీ, పరిస్థితులు ఇప్పుడు పూర్తిగా తారుమారు అయ్యాయి. నంబర్ 1 స్థానంలో ఉన్న పాలమూరు ఇప్పుడు ఏకంగా మూడు స్థానాలు దిగజారి నాలుగో స్థానానికి పడిపోయింది. ఇక నాగర్‌కర్నూల్ 24, వనపర్తి 28, గద్వాల 22, నారాయణపేట 8వ స్థానంలో ఉన్నాయి.

త్రైమాసిక పన్నులు సైతం..

ఉమ్మడి జిల్లాలో వాహనాలకు జరిమానాలు, అధిక లోడ్, పత్రాలు లేకుండా, డ్రైవర్‌కు లైసెన్స్ లేకుండా తిరిగే వాహనాలకు జరిమానాలు విధించడానికి తనిఖీలు పూర్తిస్థాయిలో జరగడం లేదు. జిల్లా ఆర్టీఏ శాఖ జీవిత కాల పన్నుతోపాటు ఫీజుల వసూలులో పూర్తిగా వెనుకబడి ఉంది. ప్రధానంగా త్రైమాసిక పన్నులు అయితే పూర్తిగా తగ్గిపోవడం సమస్యగా మారింది. దీంతోపాటు తనిఖీలు చేయడం వల్ల వచ్చిన ఆదాయం కూడా కొంత వరకు తగ్గింది. ప్రతిరోజు తనిఖీలు చేయాల్సి ఉన్నా.. సిబ్బంది కొరతతో సాధ్యపడటం లేదు. ఉన్న అధికారులు రోడ్ల మీద వాహన తనిఖీలకు వెళ్తే కార్యాలయంలో పనులు నిలిచిపోతున్నాయి.

నారాయణపేట జిల్లా

పన్నులు	లక్ష్యం	వసూలు చేసింది
మూడు నెలలు	5.65	4.65
జీవితకాలం	17.80	15.84
ఫీజులు	4.00	3.69
యూసర్ చార్జీలు	1.10	1.08
గ్రీన్ ట్యాక్స్	0.30	0.21
ఎన్‌ఫోర్స్‌మెంట్	3.80	2.69



జరిమానా రాస్తున్న ఆర్టీఏ అధికారి (ఫైల్)

సిబ్బంది నిల్..

ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారి ఉండటంతో అధిక లోడ్ కలిగిన వాహనాలు భారీగా వెళ్తుంటాయి. అలాంటి వాహనాలపై ఆర్టీఏ శాఖ కొరడా ఝులిపించడం లేదు. అలాగే పత్రాలు లేకుండా కూడా అధిక సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నా వాటిపై ఏమాత్రం దృష్టిసారించి పన్నులు వసూలు చేయడం లేదు. తనిఖీల కోసం జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేస్తున్న ఆశించిన స్థాయిలో రావడం లేదు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి సరైన పత్రాలు లేకుండా ట్రాన్స్‌ఫోర్టు లారీలు వస్తున్నా.. సిబ్బంది లేక తనిఖీలు చేయడం లేదు. దీంతో కేటాయించిన లక్ష్యం కూడా చేరుకోవడం లేదు.

ఏమాత్రం వదిలిపెట్టం..

ఉమ్మడి జిల్లాలోని అందరు ఎంవీఐలకు ఈనెల మొదటి వారంలో సమావేశం ఏర్పాటు చేసి ఆదేశాలిచ్చాం. ఈ నెలాఖరు వరకు ఇచ్చిన లక్ష్యం పూర్తి చేస్తాం. చట్టపరంగా రావాల్సిన పన్నులు ఏమాత్రం వదిలిపెట్టడం లేదు. అన్ని కోణాల్లో తనిఖీలు చేస్తూ వాహనాలపై పన్నులు వేయడం జరుగుతుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు, అధిక లోడ్, పత్రాలు లేని వాహనాలు ఇలా అన్నింటి నుంచి పన్నులు వసూలు చేస్తాం. హెల్మెట్, సీటు బెల్ట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తున్నాం.

– కిషన్, డీటీసీ ఉమ్మడి జిల్లా

వినూత్న సేవలందిస్తున్న 24 మంది సభ్యులు

- కార్మికుల జాడ కోసం నిరంతరం అన్వేషిస్తున్న బృందం
- రాత్రింబవళ్లు ప్రమాదస్థలంలోనే తవ్వకాలు జరుపుతున్న వైనం

సొరంగంలో ర్యాట్ మైనర్స్

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలోపల 13.85 కి.మీ. వద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసేందుకు మొత్తం 18 బృందాలు పని చేస్తున్నాయి. 16 రోజులుగా నిరంతరం సహాయక చర్యలు చేపడుతున్నా వారి ఆచూకీ లభ్యం కావడం లేదు. సొరంగంలో 13 కి.మీ. అవతల సొరంగ పైకప్పు కుప్పకూలడంతో సుమారు 18 ఫీట్ల ఎత్తులో 200 మీటర్ల విస్తీర్ణం వరకూ మట్టి, బురద, శిథిలాలు మేట వేశాయి. మట్టిని తొలగిస్తే పైనుంచి మరింత కుంగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ఈ ఇన్‌లెట్ టన్నెల్‌లో ఎలాంటి ఆడిట్, ఎస్కేప్ టన్నెల్స్ లేకపోవడం, నిత్యం నీటి ఊట, బురద ఉంటుండటంతో ఇంతటి క్లిష్ట పరిస్థితి ఎక్కడా చూడలేదని రెస్క్యూ నిపుణులు అంటున్నారు. ఆయా రెస్క్యూ బృందాలతో పాటు ఢిల్లీ నుంచి వచ్చిన ర్యాట్ హోల్ మైనర్స్ బృందం వినూత్న పద్ధతిలో సేవలు అందిస్తోంది.



దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద ర్యాట్‌హోల్ మైనర్స్ బృందం

రైల్వేలైన్లు, రహదారుల పనుల్లో సేవలు..

మేఘాలయా, ఈశాన్య రాష్ట్రాల్లోని బొగ్గు గనుల్లో ఎలుక బొరియలుగా సొరంగాలు తవ్వుతూ ర్యాట్ హోల్ మైనర్స్ బొగ్గును బయటకు వెలికితీస్తారు. ప్రమాదకరమైన ఈ మైనింగ్‌ను సుప్రీంకోర్టు నిషేధించింది. అయితే రైల్వే లైన్ల నిర్మాణం, జాతీయ రహదారులు, రోడ్ల నిర్మాణంలో వీరు సేవలందిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. సాధారణంగా రోడ్డు, రైల్వేలైన్ కిందుగా పైప్‌లైన్ వేయాలంటే జేసీబీల సాయంతో తవ్వుతూ రోడ్డును కట్ చేయాల్సి ఉంటుంది. ర్యాట్ హోల్ మైనర్స్ రవాణాకు ఆటంకం కలిగించకుండా, రోడ్డును తవ్వాల్సిన పని లేకుండానే కింద నుంచి సొరంగం తవ్వి పైప్‌లైన్ వేస్తారు. నిత్యం రద్దీగా ఉండే ఢిల్లీ రోడ్లపై వాహనాల రాకపోకలు కొనసాగుతుండగానే, రోడ్డు కింద నుంచి సొరంగం తవ్వి పైప్‌లైన్ వేయడంలో వీరి సేవలు విశేషంగా ఉపయోగపడుతున్నాయి.

24 గంటల పాటు సొరంగంలోని ప్రమాద స్థలం వద్దే..

సొరంగంలో మట్టి కింద చిక్కుకున్న కార్మికులను బయటకు తీసేందుకు ర్యాట్ హోల్ మైనర్స్ బృందం గతనెల 25న రంగంలో దిగింది. మొత్తం 24 మంది సభ్యులు ఉండగా, వీరిలో ఎల్లప్పుడూ ఐదు, ఆరుగురు సొరంగంలోని ప్రమాదస్థలం వద్ద మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. కేవలం ఇనుప కడ్డీలు, తట్టా, పారల సాయంతో తవ్వకాలు చేపడుతూ, మట్టిని పక్కకు వేస్తున్నారు. టన్నెల్ నిండా మట్టి పేరుకుపోయిన నేపథ్యంలో రాడార్ గుర్తించిన చోటుతో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో తవ్వకాల చేపట్టి కార్మికుల జాడను అన్వేషిస్తున్నారు. వంతుల వారీగా సొరంగంలోకి వెళుతూ రాత్రింబవళ్లు ప్రమాద స్థలంలోనే తవ్వకాలు చేపడుతున్నారు. భోజనం సైతం అక్కడే చేస్తూ మళ్లీ తవ్వకాలకు ఉపక్రమిస్తున్నారు.

తవ్విన కొద్దీ ఊటనీరు వస్తోంది..



మేం మొత్తం 24 మంది ర్యాట్ హోల్ మైనర్స్ బృందం రెస్క్యూ పనుల్లో పాల్గొంటున్నాం. ఒక్కో షిఫ్టులో ఆరుగురు చొప్పున 24 గంటల పాటు ప్రమాద స్థలం వద్ద తవ్వకాలు జరుపుతున్నాం. ఇనుప కడ్డీలు, పారలతో మట్టిని తొలగించిన కొద్దీ ఊటనీరు పెరుగుతోంది.

– ఖలీల్ ఖురేషి, ర్యాట్‌హోల్ మైనర్ సభ్యుడు

దారి ఏర్పాటు చేస్తూ తవ్వకాలు..



ప్రమాద స్థలంలో సుమారు 8 మీటర్ల మేర మట్టి, బురద, మిషన్ శిథిలాలు మేట వేసి ఉన్నాయి. బురద, కాంక్రీట్ కలసి గట్టిగా ఉంది. ఒక్క పక్కగా దారి ఏర్పాటు చేస్తూ తవ్వకాలు కొనసాగిస్తున్నాం. రోజంతా అక్కడే ఉండి పనులు నిర్వహిస్తున్నాం.

– మహమ్మద్ రషి, ర్యాట్‌హోల్ మైనర్ సభ్యుడు



టన్నెల్‌లో పూడిక తీస్తున్న ర్యాట్ హోల్ మైనర్స్ (ఫైల్)



ఢిల్లీలో రహదారి కింద సొరంగం తవ్వి పైప్‌లైన్ వేస్తున్న ర్యాట్ హోల్ మైనర్స్ (ఫైల్)

క్లుప్తంగా

కత్తితో దాడి

● ఒకరికి గాయాలు

నవాబుపేట: మండలంలోని రుద్రారం గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ చివరకు కత్తిపోట్ల వరకు దారితీసింది. స్థానికుల వివరాల మేరకు.. రుద్రారం గ్రామానికి చెందిన వివాహిత తన వ్యవసాయ పొలం వద్ద ఉండగా.. అదే గ్రామానికి చెందిన బక్క సాయికుమార్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. విషయాన్ని బాధితురాలు తన భర్తకు చెప్పడంతో శనివారం రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. అయితే గ్రామస్తులు కలుగజేసుకుని ఇరు కుటుంబాలకు సర్దిచెప్పి పంపించారు. అయితే ఆదివారం బాధితురాలి కుమారుడు విజయ్‌కుమార్, సాయికుమార్ మధ్య మరోసారి గొడవ చోటు చేసుకుంది. ఈ క్రమంలో సాయికుమార్ ఇంట్లో నుంచి కత్తి తీసుకువచ్చి విజయ్‌కుమార్‌పై దాడికి పాల్పడటంతో రక్తగాయాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌లో బాధితుడిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. కాగా, తమ ఇంట్లోకి విజయ్‌కుమార్ చొరబడి తన కుమారుడు సాయికుమార్‌ను అకారణంగా తిట్టి చెయ్యి చేసుకున్నాడని.. తనను సైతం దుర్భాషలాడాడని బక్క పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని వనపట్లకు చెందిన అనూష (32) చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. ఈ నెల 7న స్వగ్రామం నుంచి జిల్లా కేంద్రానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. కొల్లాపూర్ క్రాస్ రోడ్డు సమీపంలో వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో అనూషకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

అమరవాయిలో మరో వ్యక్తి..


పాగాకు నాగరాజు (ఫైల్)

మల్దకల్: మండలంలోని అమరవాయికి చెందిన హరిజన్ పాగా కు నాగరాజు (35) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసుల వివ రాల మేరకు.. పాగాకు నాగరాజు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. వ్యాపారంలో కొంత ఇబ్బందులు తలెత్తడంతో పాటు ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన అతడు.. ఈ నెల 3న పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య జయమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. .

నీటి గుంతలో పడి గొర్రెల కాపరి..


మహేశ్ (ఫైల్)

చిన్నచింతకుంట: నీటి గుంతలో పడి గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన మండలంలోని ఏదులాపురం శివారు చెక్‌డ్యాం సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కౌకుంట్ల మండలం అప్పంపల్లికి చెందిన గొర్రెల కాపరి మహేశ్ (25) ఆదివారం తనకున్న గొర్రెలను స్నానం చేయించేందుకు తోటి కాపరి సాయిలుతో కలిసి అప్పంపల్లి–ఏదులాపురం మధ్యలో ఊక చెట్టు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాం సమీపంలోని నీటి గుంతకు తీసుకొచ్చాడు. గొర్రెలకు స్నానం చేయిస్తుండగా మహేశ్ కాలుజారి గుంతలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో కొట్టుమిట్టాడుతుండగా సాయిలు కేకలు వేసి చుట్టుపక్కల ఉన్న గొర్రెల కాపరులను పిలిచాడు. వారు వచ్చేసరికి మహేశ్ నీటిలో మునిగిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మహేశ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాంలాల్‌నాయక్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మరికల్: పట్టణ శివారులోని శ్రీవాణి పాఠశాల సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

ఎట్టకేలకు ఒకరు..


సొరంగంలో శిథిలాలను తొలగిస్తున్న రెస్క్యూ సిబ్బంది

● ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ఒక కార్మికుడి మృతదేహం వెలికితీత
● పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్‌సింగ్‌గా నిర్ధారణ
● మిగతా ఏడుగురి ఆచూకీ కోసం కొనసాగుతున్న సహాయక చర్యలు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న ఎనిమిది కార్మికుల్లో ఒకరి మృతదేహం ఎట్టకేలకు బయటపడింది. ఆదివారం రాత్రి 6.30 గంటల సమయంలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన గురుప్రీత్ సింగ్ (40) మృతదేహాన్ని సహాయక బృందాలు వెలికితీసి బయటకు తీసుకువచ్చాయి. మిగతా ఏడుగురు కార్మికులు ప్రమాద స్థలంలో మట్టిలోనే కూరుకుపోయి ఉండగా.. వారి జాడ కోసం నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

■ గురుప్రీత్‌సింగ్ రాబిన్స్ కంపెనీలో టీబీఎం ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్లుగా ఆయన దోమలపెంటలోని ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో విధులు నిర్వహిస్తున్నారు. 16 రోజుల తర్వాత బయటపడిన గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి చెందిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం ఇక్కడికి చేరుకుని నమూనాలను సేకరించారు. డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి, అచ్చంపేట ఆర్డీఓ మాధవి ఆధ్వర్యంలో పంచనామా, పోస్టుమార్టం అనంతరం మృతదేహం గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ జనరల్ ఆస్పత్రికి చేరుకుని పోస్టుమార్టం ప్రక్రియను పర్యవేక్షించారు. అనంతరం ప్రత్యేక అంబులెన్స్‌లో మృతుడి స్వరాష్ట్రం పంజాబ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ ప్రకటించారు.

మిగతా వారికోసం అన్వేషణ..

గతనెల 22న ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం చోటుచేసుకోగా.. మొత్తం 8 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. 16 రోజులుగా నిరాటంకంగా ప్రభుత్వం సహాయక చర్యలు చేపడుతోంది. ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, దక్షిణమధ్య రైల్వే తదితర 12 సంస్థల రెస్క్యూ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం ఒకరి మృతదేహం లభ్యం కావడంతో.. మిగతా వారు సైతం సమీప ప్రదేశంలోనే ఉంటారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తవ్వకాలను ముమ్మరం చేసి.. కడావర్ డాగ్స్ గుర్తించిన ప్రదేశాల్లో జల్లెడ పడుతున్నారు. మరో రెండు రోజుల్లో మిగతా కార్మికుల ఆచూకీ లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.



సొరంగం నుంచి కార్మికుడి మృతదేహాన్ని బయటికి తీసుకువస్తున్న సహాయక బృందాలు, బురద, ఊట నీటి తొలగింపు ప్రక్రియ చేపడుతున్న సహాయక బృందాలు

కష్టం బీసీలది.. అధికారం రెడ్డీలదా?


బీసీ రాజకీయ చైతన్య సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

● 'స్థానికం'లో బీసీలు సత్తా చాటాలి
● అప్పులు మాకు.. ఆస్తులు మీకు
● పార్టీలు మారొద్దని మీరు నీతులు చెబుతారా
● 2028లో బీసీయే రాష్ట్ర ముఖ్యమంత్రి
● బీసీ రాజకీయ చైతన్య సదస్సులో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మహబూబ్‌నగర్ న్యూటౌన్: 'ఏళ్లకు ఏళ్లుగా భుజాలు కాయలు కాసేలా బీసీలు పార్టీల జెండాలు మోస్తూనే ఉన్నారు.. అధికారం అనుభవిస్తున్నది మాత్రం రెడ్డీలు' అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బీసీ రాజకీయ చైతన్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడ అవకాశముంటే అక్కడ బీసీలు అధిక సంఖ్యలో పోటీ చేసి సత్తాచాటాలని పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లాలోని అగ్రకుల నాయకులైన సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి పార్టీలు మారుతూ అధికారాన్ని అనుభవిస్తున్నారన్నారు. బీసీ బిడ్డ ముదిరాజ్ సింహంగా పేరొందిన ఎర్రసత్యంను బుల్లెట్లతో కాల్చి చంపిన వారే ఆయన ఆశయాలను కొనసాగిస్తామని కపట ప్రేమ చూపుతున్నారని, బీసీలంతా ఈ విషయాన్ని గమనించాలన్నారు. రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న కుట్రలను దృష్టిలో ఉంచుకొని ఒక బీసీ అభ్యర్థికి ఏ పార్టీ నుంచి అవకాశం వచ్చినా బీసీలంతా ఐక్యంగా ఉండి గెలిపించుకోవాలని అన్నారు. 70 ఏళ్ల పాలనలో అధికారాన్ని అనుభవించి అగ్రకులాలు ఆస్తులు కూడగట్టుకుంటే వెనుకబడిన కులాలపై అప్పులు మోపారని మండిపడ్డారు. మీ ఓట్లు మాకొద్దని, దమ్ముంటే మా బీసీల ఓట్లు మీకొద్దని చెప్పాలని సవాల్ విసిరారు. ఇది బీసీల రాజకీయ చైతన్య సదస్సు కాదని.. రెడ్లకు, బీసీలకు విడాకుల సభ అన్నారు. 2028లో ముఖ్యమంత్రిగా బీసీలు అయి తీరుతారన్నారు.

■ పాలమూరు జిల్లాలో 14 నియోజకవర్గాలుంటే 9 నియోజకవర్గాల్లో మీరే ఉన్నారని, పార్టీలు మారుతూ అధికారాన్ని అనుభవిస్తున్నారని, మీరు బీసీలు పార్టీలు మారొద్దని నీతులు చెబుతున్నారని విమర్శించారు. బీసీ ప్రజా ప్రతినిధులారా ఎక్కడ అవకాశమున్నా పోటీ చేయాలని, తీన్మార్ మల్లన్న పూర్తి మద్దతుతో గెలుపులో భాగమవుతామన్నారు. బీసీ రాజ్యంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను ఎత్తివేస్తామని, దొంగదారిన వచ్చిన ఉద్యోగాలను రద్దు చేసి రికవరీ చేస్తామన్నారు. ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి గెలిచిన మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, రజక బిడ్డ వీర్లపల్లి శంకరయ్య మంత్రి ఎందుకు కావడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ టైమ్స్ అధినేత సంగెం సూర్యారావు, సూర్యాపేట ఎమ్మెల్యే అభ్యర్థి వడ్డే జానయ్య, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు ప్రణీల్‌చందర్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు రాజు, నిర్మల, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, బీసీ రాజ్యాధికార సమితి ఉమ్మడి జిల్లా కన్వీనర్ మైత్రి యాదయ్య, బీసీ సమాజ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్, తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి, లక్ష్మణ్, వన్నాడ అంజన్న, కావలి శంకర్ పాల్గొన్నారు.

శాంతికుమార్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శ


బండారి లక్ష్మణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

పాలమూరు: బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌ను ఆదివారం జిల్లాకేంద్రంలోని ఏనుగొండలోని ఆయన నివాసంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. శాంతికుమార్ తండ్రి బండారి లక్ష్మణ్ మృతిచెందడంతో ఆయన చిత్రపటానికి బండి సంజయ్ పువ్వులు వేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మధ్యాహ్నం 12 గంటలకు పట్టణంలోని శాంతికుమార్ ఇంటికి చేరుకోగా బీజేపీ నేతలు స్వాగతం పలికారు. నేరుగా ఇంట్లోకి వచ్చిన బండి సంజయ్ బండారి లక్ష్మణ్ చిత్రపటం దగ్గరకు వెళ్లి నివాళులర్పించారు. ఆ తర్వాత శాంతికుమార్‌ను పరామర్శించారు. పార్టీ శ్రేణులు, నేతలు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. అనంతరం పార్టీ నేతలతో మాట్లాడిన మంత్రి మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత మహబూబ్‌నగర్ నుంచి తిరిగి హైదరాబాద్ వెళ్లారు. అలాగే శాంతికుమార్‌ను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీజేపీ ఎస్సీ మోర్చ జాతీయ అధ్యక్షుడు ఎస్. కుమార్, సంగప్ప, ఎన్పీ సుభాష్, బీసీ సంఘాల నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాగూరావు నామాజీ, మయూర్‌నాథ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం


బీచుపల్లిలో సీతారాముల కల్యాణం చేస్తున్న అర్చకులు

ఎర్రవల్లి: శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించా రు. ఆలయ ప్రధాన అర్చకులు భానుమూర్తి, దత్తుస్వాముల ఆధ్వర్యంలో సీతారాములను ముస్తాబుచే సి వేదమంత్రాల నడుమ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని సీతారాముల కల్యాణాన్ని కనులారా తిలకించారు. భక్తులకు ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు పేర్కొన్నారు.

పాలమూరు యువకుడి ఘనత

● సైకిల్‌పై ఇప్పటి వరకు 7,500 కిలోమీటర్ల ప్రయాణం
● ట్రెక్కింగ్ ద్వారా నేపాల్‌లోని అన్నపూర్ణ బేస్‌క్యాంప్ చేరిక



నేపాల్‌లోని అన్నపూర్ణ బేస్‌క్యాంప్ వద్ద మల్లేష్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రం బోయపల్లి 16వ వార్డుకు చెందిన మల్లేష్‌గౌడ్ దేశంలోని జ్యోతిర్లింగాలను దర్శనం చేసుకోవడానికి సైకిల్‌పై సాహస యాత్రకు పూనుకున్నాడు. ఈ క్రమంలో గతేడాది అక్టోబర్ 17న బోయపల్లి నుంచి సైకిల్‌యాత్ర చేపట్టి తాండూరు మీదుగా తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రంలోని రక్సాల్ బార్డర్ మీదుగా నేపాల్‌లోకి ఈ ఏడాది జనవరి 23న ప్రవేశించాడు. 45 రోజులపాటు సైకిల్‌పై నేపాల్ దేశంలో తిరిగి అక్కడి నయాపూల్ ప్రాంతం నుంచి ట్రెక్కింగ్ చేసుకుంటూ 4,130 మీటర్ల ఎత్తుగల అన్నపూర్ణ బేస్ క్యాంప్ వద్దకు ఈ నెల 8న చేరాడు. మల్లేష్‌గౌడ్ ఇప్పటి వరకు 7,500 కిలోమీటర్ల యాత్ర పూర్తి చేసి భీమా శంకర్, త్రయంబకేశ్వర్, గ్రిస్నేశ్వర్, సోమనాథ్, నాగేశ్వర్, ఓంకారేశ్వర్, ఉజ్జయిని, కాశీ జ్యోతిర్లింగాలతోపాటు గుజరాత్‌లోని ధామ్ ద్వారకదేశ్‌ను దర్శించుకున్నాడు. ఈ నెల 15న నేపాల్ నుంచి బయలుదేరి ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్, బద్రినాథ్, గంగోత్రి, యమునోత్రిని దర్శించుకుంటానని మల్లేష్‌గౌడ్ తెలిపారు. నా సైకిల్ యాత్రలో నీటి పొదుపు, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు వివరించారు. సైకిల్ తొక్కడం ద్వారా ఇప్పుడున్న కలుషిత వాతావరణాన్ని కొంతమేర తగ్గించవచ్చనే ప్రధాన అంశాన్ని వివరించడం జరిగిందన్నారు. సైకిల్‌పై యాత్రను కొనసాగిస్తూ దేశం మొత్తం తిరగడమే తన ధ్యేయమన్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి వృద్ధురాలు..


తిమ్మమ్మ మృతదేహం

ఆత్మకూర్: ఆర్టీసీ బస్సు ఎక్కే క్రమంలో వృద్ధురాలు బస్సు కింద పడి తీవ్ర గాయాలపాలై మృతి చెందిన సంఘటన ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాలు.. చిన్నచింతకుంట మండలం అప్పంపల్లికి చెందిన తిమ్మమ్మ(67) ఆదివారం గ్రామస్తులతో కలసి ఆత్మకూర్‌లో జరిగే సంతలో కూరగాయలు కొనేందుకు వచ్చింది. సాయంత్రం 4 గంటల సమయంలో స్థానిక గాంధీచౌక్‌లో బస్సుకోసం ఎదురు చూస్తుండగా మహబూబ్‌నగర్ డిపోకు చెందన బస్సు వచ్చింది. బస్సు ఎక్కుతుండగా ముందుకు కదలడంతో తిమ్మమ్మ వెనుక టైర్ల కింద పడి గాయాల పాలైంది. గమనించిన తోటి ప్రయాణికులు 108లో స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. బస్సు డ్రైవర్ అజాగ్రత్తతోనే తిమ్మమ్మ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి


సత్యనారాయణ శర్మ (ఫైల్)

రాజాపూర్: మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామంలో ఓ శుభకార్యంలో పూజ చేసేందుకు స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని వెనకనుంచి మోటార్‌సైకిల్‌పై వచ్చి ఢీకొట్టింది. తీవ్రగాయాల పాలైన వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ శివానంద్‌గౌడ్ తెలిపారు. వివరాలు.. జడ్చర్లకు చెందిన ఓరుగంటి సత్యనారాయణశర్మ(71) ఆదివారం తన స్కూటీపై ముదిరెడ్డిపల్లిలో ఓఇంట్లో బాసింగపు పూజ చేయించేందుకు వెళ్తున్నాడు. ముదిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డులో గ్రామంలోకి వెళ్లేందుకు మళ్లుచుండగా వెనకనుంచి ఓమోటార్‌సైకిల్ వేగంగా వచ్చి ఢీకొన్నది. తీవ్రగాయాల పాలైన సత్యనారాయణను స్థానికులు చికిత్స నిమిత్తం 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఓరుగంటి ఆదిత్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


గిరన్న (ఫైల్)

మదనాపురం: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన ఘటన మదనాపురం మండలం రామన్‌పాడులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రామన్‌పాడుకు చెందిన మత్స్యకారుడు వాకిటి గిరన్న (55) రోజు మాదిరిగానే తెల్లవారుజామున రామన్‌పాడు జలాశయంలో చేపల వేటకు వెళ్లాడు. ఉదయం 10 గంటలు దాటినా అతడు ఇంటికి రాకవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు.. జలాశయంలో గాలింపు చేపట్టడంతో మృతదేహం లభ్యమైంది. అతడి రెండు కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య వాకిటి కుర్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

చెరువులో వ్యక్తి గల్లంతు

కొత్తకోట రూరల్: కూలీ పనులు చేసుకుంటున్న ఓ వ్యక్తి గ్రామ సమీపంలోని చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన ఘటన కొత్తకోట మండలం మిరాసిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్న పాపన్న(50) శనివారం కూతురు శిరీషతో కలిసి ఉపాధి పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికొచ్చాడు. చేపల వేటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గ్రామంలో ఆరా తీశారు. గ్రామానికి చెందిన జంగిడి రాజు గ్రామ సమీపంలోని సాయికుంట చెరువు దగ్గర పాపన్న చెప్పులు, బట్టలు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చెరువు దగ్గరకు వెళ్లిన పాపన్న భార్య చెప్పులు, బట్టలు చూసి తన భర్తవే అని గుర్తించింది. చెరువులో మృతదేహం కనిపించలేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అసంపూర్తి పనులతో అవస్థలు


అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులు

జడ్చర్ల సిగ్నల్‌గడ్డ వద్ద నిలిచిన రహదారి పనులు

● మట్టి, దుమ్ముతో రాకపోకలకు ఇబ్బందులు
● ట్రాఫిక్ సమస్యలు.. చోద్యం చూస్తున్న అధికారులు

జడ్చర్ల: పట్టణంలోని సిగ్నల్‌గడ్డ వద్ద రహదారి విస్తరణ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పని ప్రదేశంలో యంత్రాలు, కార్మికులు, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ సుమారు మూడు నెలలుగా కనిపించడం లేదు. రోడ్డు, రైల్వే వంతెన ఇరుకుగా ఉండడంతో దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. మూడేళ్ల కిందట రహదారి విస్తరణకు అంకురార్పణ జరిగింది. నాటి నుంచే మరిన్ని కష్టాలు మొదలయ్యాయి.

రూ.45.81 కోట్ల వ్యయం..

ఈ ప్రాంతంలో రహదారి విస్తరణ పనులకు కేంద్రం రూ.45.81 కోట్లు మంజూరు చేసింది. వంతెన నిర్మాణానికి రైల్వే విద్యుత్‌లైన్ ఆటంకంగా ఉండటంతో పనుల్లో జాప్యం జరిగింది. రెండునెలల కిందట రైల్వేశాఖ అధికారులు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించినా.. ఇప్పటి వరకు పనులు తిరిగి ప్రారంభం కాలేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుండటంతో పనులు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


వాహనాల రాకపోకల సమయంలో మట్టిరోడ్డుపై దుమ్ము

■ సిగ్నల్‌గడ్డ ప్రాంతం పట్టణానికి కూడలిలా ఉంది. అటు హైదరాబాద్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, గోవా తదితర దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలు, ఇటు ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, వనపర్తి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ కూడలి నుంచే వెళ్లాల్సి ఉంటుంది. నిత్యం వెయ్యికిపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రాంతంలో పనులు చేపట్టేందుకు పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో స్థానికంగా ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ చిన్న సమస్య ఎదురైనా గంటల తరబడి రాకపోకలకు నిలిచిపోతున్నాయి. రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడం, విస్తరణ పనులు చేపట్టకపోవడంతో భారీ వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము లేస్తోంది. ఫిబ్రవరి నెలాఖరు వరకు ఒకవైపు రహదారి పనులు పూర్తి చేస్తామని స్థానిక నాయకులు, ప్రజలకు కాంట్రాక్టర్ చెప్పినా ఇప్పటి వరకు పూర్తి చేయలేదు. మరో రెండునెలల్లో వర్షాకాలం ప్రారంభమైతే పనులు చేసే పరిస్థితి ఉండదు. ఇప్పటికైనా ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ స్పందించి రోడ్డు పనులపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


పనుల్లో వేగం పెంచాలి..



కూడలిలో ఎక్కడికక్కడ గుంతలు ఉన్నాయి. దుమ్ము విపరీతంగా వస్తుండటంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు, పాదచారులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– బాలవర్ధన్‌గౌడ్, జడ్చర్ల

దుకాణాలు మూసుకోవాల్సి వస్తుంది..



సిగ్నల్‌గడ్డ వద్ద రహదారి విస్తరణ పనులు ఏళ్లుగా కొనసాగుతున్నాయి. దుమ్ము విపరీతంగా వస్తుండటంతో వ్యాపారాలు సాగడం లేదు. దుమ్ము కారణంగా దుకాణాలు మూసుకోవాల్సి వస్తోంది. అధికారులు ఎంతమాత్రం స్పందించడం లేదు. త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

– అబిదాలి మహ్మద్ ,జడ్చర్ల

త్వరలో బీటీ పనులు చేపడతాం

బీటీ రోడ్డు పనులు త్వరలోనే చేపడతాం. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అదేవిధంగా రహదారి విస్తరణ పనులు పూర్తి చేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటాం. బ్రిడ్జి కూడా త్వరితగతిన నిర్మిస్తాం.

– రవి, ఏఈ, నేషనల్ హైవే అథారిటీ